

● ఆలయాల్లో 'ముక్కోటి' సందడి



మందమర్రి : స్వామి వారిని దర్శించుకుంటున్న సీపీ శ్రీనివాస్

జిల్లా వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులుదీరారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో కలెక్టర్, సీపీ దంపతులు పూజలు చేశారు. వివరాలు 6లో



హాజీపూర్ : గుడిపేటలో గోవింద క్షేత్రంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పెద్దపులి ఆవాసానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

● ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కాసిపేట, (ఆంధ్రజ్యోతి) :

ఆంధ్రజ్యోతి : పెద్దపులి శాశ్వత ఆవాసానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

డీఆర్‌వో: అడవిలోకి పెద్దపులి వచ్చిపోతోంది. శాశ్వత ఆవాసం కోసం శాకాహార జంతువుల సంఖ్యను పెంచాం. నీటి నిల్వల కోసం అడవిలో చెక్ డ్యామ్‌లను నిర్మించాం. వేటగాళ్ల నుంచి కాపాడేందుకు నిఘా బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కలప అక్రమ రవాణాను ఎలా అరికడుతున్నారు?

డీఆర్‌వో: కలప అక్రమ రవాణా నిర్మూలనకు గ్రామాల్లో సమాచార వ్యవస్థను పటిష్టం చేశాం. పాత నేరస్తులకు అవగాహన కల్పించి మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. కలప అక్రమ రవాణా చేయకుండా వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించడంతో కలప అక్రమ రవాణాను నివారించగలిగాం.

ఆంధ్రజ్యోతి : అడవిలో ఏర్పడే కార్చిచ్చును ఎలా నియంత్రిస్తారు?

డీఆర్‌వో: ఈ ఏడాది రేంజ్ పరిధిలో క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేస్తున్నాం. మంటలు చెలరేగినప్పుడు వీరు వెంటనే స్పందించి ఆర్పివేస్తారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తాం. మంటలు అంటుకున్నప్పుడు ఎయిర్ బ్రోయర్ల సహాయంతో విస్తరించకుండా నియంత్రిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : అడవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

డీఆర్‌వో: అందరికి ఫారెస్టు యాక్టు గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అడవి చుట్టూ కంచెలు, కందకాలు తవ్వించి పశువుల కాపర్లను అడవుల్లోకి వెళ్లకుండా నివారించాం. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అవగాహన కల్పిస్తున్నాం.

జిల్లా కేంద్రంలోని సాయికుంటలో ఎఫ్‌ఎస్టీపీకి కేటాయించిన స్థలం



ఎఫ్ఎస్‌టీ ప్లాంట్‌లకు మోక్షమెప్పుడో..!

- మానవ వ్యర్థాలతో ఎరువు తయారీకి ఆటంకాలు
- జిల్లాకు మూడు ఎఫ్ఎస్‌టీ ప్లాంట్‌లు మంజూరు
- స్థలాలు కేటాయింపుల్లో తీవ్ర జాప్యం
- ప్రారంభంకాని నిర్మాణ పనులు
- భూముల కేటాయింపులో ప్రజల అభ్యంతరం

మంచిర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యర్థాలతో ఎరువును తయారు చేసే ప్రక్రియకు ఆది నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయి. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్)లను నెలకొల్పేందుకు స్థలాలు కేటాయించాలని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. సుమారు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఆ దిశగా కార్యాచరణ జరుగకపోగా, స్థలాల ఎంపిక కొలిక్కి రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 71 పాత మున్సిపాలిటీలను ఇందుకు ఎంపిక చేశారు. మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీలలో ఒక్కొక్క ఎఫ్ఎస్‌టీ ప్లాంట్‌ను సుమారు రూ. 4 కోట్లతో ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన ఎకరం స్థలాన్ని కూడా ఆయా మున్సిపాలిటీలు కాంట్రాక్టర్లకు అప్పగించగా అగ్రిమెంట్ ప్రక్రియ కూడా పూర్తయి పనులు చేపట్టే ముందు అర్ధాంతరంగా నిలిచిపోయింది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ పూర్తయిన తరువాత మూడు నెలల వ్యవధిలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్లాంట్ ప్రారంభమైన నాటి నుంచి 30 సంవత్సరాల వరకు సదరు కాంట్రాక్టరే నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. మానవ వ్యర్థాలను బయట పడేయం ద్వారా వాతావరణం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుండటంతో అప్పటి ప్రభుత్వం ఎఫ్ఎస్‌టీపీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

అభ్యంతరాల వెల్లువ

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని సాయికుంటలో ఎఫ్ఎస్‌టీపీ కోసం అధికారులు స్థలం కేటాయించారు. స్థలం నివాస గృహాలకు దగ్గరగా ఉండటంతో ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస గృహాలకు కేవలం 100మీటర్ల దూరంలో ప్లాంటు నిర్మాణానికి స్థలం కేటాయించడంతో భవిష్యత్తులో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పర్యావరణశాఖ నిబంధనల మేరకు నివాస గృహాలకు కనీసం 200 మీటర్ల దూరం ఉండాలని, మరో చోట ప్లాంటు నిర్మాణం చేపట్టాలని స్థానికులు అప్పటి కలెక్టర్ భారతి హోళికేరి, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు.

నిబంధనలు ఇలా..

ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంటు ఏర్పాటు చేసే స్థలం విషయంలో పర్యావరణ శాఖ నిబంధనలు విధించింది. నివాస గృహాలు, మతపరమైన స్థలాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు, నీటి ప్రదేశాలు, పార్కులు, రోడ్లకు నిర్ణీత దూరంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

మిగతా 7లో

పర్యావరణ పరిరక్షణకు దోహదం

నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల నుంచి మున్సిపాలిటీల ద్వారా లైసెన్సు పొందిన స్లడ్జింగ్ ఆపరేటర్లు మురికిని సేకరించి నేరుగా ఎఫ్ఎస్‌టీపీలకు తరలిస్తారు. అక్కడ దాన్ని బ్యాంకర్లో డంప్ చేసిన తరువాత ఎరువుగా మారుస్తారు. ఇలా తయారు చేసిన ఎరువును తొలుత మున్సిపాలిటీల పరిధిలోని మొక్కలకు ఉపయోగిస్తారు. పంట పొలాలకు, చేలకు అవసర మైన రైతులు ఎరువును కొనుగోలు చేసి వినియోగిస్తారు. సాధారణంగా ఇండ్లలోని సెప్టిక్ ట్యాంకులు నిండగానే ప్రైవేటు ఆపరేటర్లు దాన్ని సేకరించి బహి రంగ ప్రదేశాల్లో డంప్ చేస్తారు. బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం మూలంగా వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. చెరువులు, కుంటలు, కాలువలు, నదులు, వాగుల పక్కన పడవేస్తే నీరు కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశాలుంటాయి. దాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఎఫ్ఎస్‌టీపీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సెప్టిక్ ట్యాంకుల నుంచి మురికి సేకరించేందుకు ఆపరేటర్లకు మున్సిపాలిటీ లైసెన్సులు మంజూరు చేశాయి. మంచిర్యాల మున్సిపాలిలో నలుగురు, బెల్లంపల్లిలో ఇద్దరు చొప్పున ఆపరేటర్లను ఎంపిక చేసిన అధికారులు వారికి లైసెన్సులు సైతం మంజూరు చేశారు. లైసెన్సులు మంజూరైనందున ఇకపై ఇండ్లలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి కేవలం లైసెన్సు పొందిన ఆపరేటర్లు మాత్రమే మురికిని సేకరించవలసి ఉంటుందని, ఇతరులు సేకరించడం, బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేయడం నిషేధించినట్లు ప్రకటించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

హాజీపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్ పాండే అన్నారు. శుక్రవారం గుడిపేట మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో 11వ ఇంటర్ కార్మెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు.

విద్యార్థులు పలు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ప్రధానోపాధ్యాయురాల్లు సిస్టర్ ఆల్ఫీ, లిస్సల్, లిస్‌బెత్, జ్యోతి, రిన్సీ, సారుప్యి, రినైట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు

ఆదివాసీ కుటుంబాలకు పోలీసుల అండ



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

తాండూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కుటుంబాల సంక్షేమమే పోలీసుల ధ్యేయమని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. శుక్రవారం మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ (బెజ్జాల) గ్రామంలో తాండూర్ సర్కిల్ పోలీసులు, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో భాగంగా పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, సరుకులు, వంట సామగ్రి, చీరలు, ధోతులు, లుంగీలు అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఆదివాసీ గిరిజన యువకులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల శ్రేయస్సుకు పోలీసులు ఎప్పుడు కృషి చేస్తారన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంఘ విద్రోహ శక్తులు ప్రలోభాలకు గురి చేసి చెడు మార్గాల వైపు ప్రోత్సహించేలా చేస్తారని, ప్రలోభాలకు లొంగకుండా మంచిని ఎంచుకుని సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆదివాసీ గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మాదారం ఎస్ఐ సౌజన్య, ఎస్ఐ కిరణ్‌కుమార్, సొసైటీ సభ్యులు అభినవ సంతోష్‌కుమార్, సురబి శరత్‌కుమార్, లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు పర్వతిరావు, తిరుపతి, కన్నయ్య, బాపు, హన్మంతు, బాబు, జమున, సీతాబాయి, పాల్గొన్నారు.

బీసీల సమస్యలను పరిష్కరించాలి



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బీసీ సంఘం నాయకులు శుక్రవారం మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీ ల ఫెడరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయాలని, లక్ష కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సంఘం నాయకులు శ్రీనివాస్, రమేష్, లచ్చన్న, రఘునందన్, భీమ్‌సేన్, రాములు, బిక్షపతి, సతీష్, రాజేశం పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మందమర్రిరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజారమేష్ పేర్కొన్నారు. శుక్ర వారం ఆదిల్‌పేట గ్రామంలో ఇంటింటికి పోస్టర్లను అంటించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలు ప్రకటించడం రైతులను మోసం చేయడ మేనన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు వేల్పుల రవి, గుర్రం శ్రీనివాస్‌గౌడ్, లౌడం రాజ్‌కుమార్, సోదరి పున్నం, ఫిరోజ్, రాములు, వాలా రవీందర్‌రావు, కొట్రంగి రాజలింగు, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను అంటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలో మందమర్రి వాసికి ద్వితీయ బహుమతి

మందమర్రి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీల్లో మందమర్రికి చెందిన శనిగారపు హేమలత ద్వితీయ స్థానం సాధించింది. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలో హేమలత ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.



శనిగారపు హేమలత

ద్వితీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం ఆనందంగా ఉంది. గతేడాది ప్రథమ బహుమతి సాధించాను. ఈసారి కూడా ప్రథమ బహుమతి సాధించాలనే పట్టుదలతో పోటీలో పాల్గొన్నా. చిన్న పొరపాట్లతో ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాను. ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తోంది. ముగ్గులు మన సంస్కృతికి ప్రతీక అన్నారు.

మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి



కరదీపికను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా శిశు మరణాల నియంత్రణకు అర్మాన్ సంస్థ ద్వారా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 230 మంది ఆరోగ్య కార్యకర్తలకు అర్మాన్ సంస్థ ఇస్తున్న శిక్షణను ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో మాతాశిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆసుపత్రులలో వివరాలు నమోదు చేసుకుని మందులు, పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, సీ సెక్షన్, కామెర్లు, క్షయ, పిండం ఎదుగుదలకు ముందు రక్తస్రావం తదితర వాటిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం శిక్షణ కరదీపికలను విడుదల చేశారు. డాక్టర్‌లు కృపాబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, ఉప వైద్యాధికారి సీతారామరాజు, డాక్టర్‌లు ప్రసాద్, అనిత్, కాంతారావు, ఎస్‌వో ప్రశాంతి, డీపీవో ప్రవళిక, డీడీఎం పద్మ, డీపీహెచ్ఎన్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత, కుప్తి, మందాకిని ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పి మర్చిపోయారన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గోవర్ధన్, శ్రీనివాస్, ప్రతాప్, రామయ్య, కలీందర్‌కాన్, బాబన్న, లాల్‌కుమార్, జయరావు, గోపినాద్, రాజేశం, రంజిత్, తిరుపతి, దేవరాజ్, దేవన్న, పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

తాండూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రెండు జిన్నింగు మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 16 నుంచి పత్తి కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో

తాండూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మధ్యాహ్న భోజన కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ ప్రభుత్వం నాసిరకం బియ్యం పంపిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు మల్లక్క, వారద, వరలక్ష్మీ, కవిత, శంకరమ్మ, లక్ష్మీ, నానయ్య, శంకర్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


పోచయ్య (ఫైల్)

లక్సెట్టిపేట రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు ఇవ్వమని అడిగినందుకు వృద్ధుడిని కర్రతో కొట్టగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్సెట్టిపేట మండలం జెండవెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు పోచయ్య(65) అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన కోన శంకరయ్యకు రూ.30వేలు అప్పుగా ఇచ్చాడు. ఈనెల 7న పోచయ్య తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని శంకరయ్యను అడిగాడు. ఈ విషయం లో మాటామాటా పెరిగి కర్రతో పోచయ్య తలపై శంకరయ్య కొట్టడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పోచయ్యను లక్సెట్టిపేట ఆసుపత్రికి, అనం తరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి మనుమడు వెల్తపు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై సతీష్ శంకరయ్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అందజేత

జైపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొండ వెంకటేష్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం అందజేసినట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. వెంకటేష్ మూడు నెలల క్రితం మొబైల్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితునికి అప్పగించామని తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

భీమిని, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల విక్రయం కేసుల్లో పాత నేరస్తులుగా ఉన్న పలువురిని శుక్రవారం తహసీల్దార్ బికర్ణదాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. వీరిలో షేక్ అంజద్ పాషా, జాడి వెంకటేష్, షేక్ జాహీద్‌పాషా, రాకెర సుధాకర్, తొర్రెం శంకర్ ఉన్నారు. నకిలీ గ్లైసిల్ విత్తనాలు అమ్మడం నేరమని, చట్ట విరుద్ధంగా ఎవరైనా అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కాసిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బల్లార్షా నుంచి మందమర్రికి చెందిన సహాని సందీప్, ఉన్ని పవన్‌లు బైక్‌పై తీసుకువస్తున్నారనే సమాచారం మేరకు సోమగూడెం టేకుచెట్ల వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద నుంచి 140 గ్రాముల గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 3500 ఉంటుందని తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

అక్రమ కలపతో ఫర్నీచర్ చేస్తే చర్యలు

వేమనపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమ కలపతో ఫర్నీచర్, ఇంటి నిర్మాణానికి కిటికీలు, దర్వాజలు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నీల్వాయి ఎఫ్ఆర్వో అప్పలకొండ హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో వడ్రంగులతో సమావేశం నిర్వహించారు. టింబర్ డిపో నుంచి అనుమతులు పొందిన కర్రతోనే పనులు చేయాలని సూచించారు. అక్రమ కలపతో నిర్మాణాలు చేస్తే పనికి సంబంధించిన మిషన్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. డిప్యూటీ ఆర్వో ప్రమోద్‌కుమార్, బీట్ ఆఫీసర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసు

బెల్లంపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే రడగంబాల బస్తీలో శుక్రవారం పాత కక్షలను మనస్సులో పెట్టుకుని దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఫర్హానా, ముజ్జు, అన్వర్, యోయిన్, ముక్తార్‌లు పాత కక్షలతో సలీం, జమీల్, సల్మాన్‌లు ఒకరిపై ఒకరు కర్రలు, బండలతో దాడి చేసుకున్నారని తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

చెన్నూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బడా హనుమాన్ ఆలయం ప్రాంతంలోని సజ్జనపు శ్రీనివాస్‌కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పివేశారు. బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి రూ.3 వేల నగదు, 25 కేజీల బియ్యం అందించారు. ప్రమాదంలో దాదాపు రూ. 5 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



భీమిని పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, బెల్లంపల్లి కృష్ణవేణి పాఠశాలలో గాలి పటాలతో చిన్నారులు

బెల్లంపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వరూప, అధ్యాపకులు పాల్గొన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించి భోగి మంటలను వేశారు. పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): తీగల్‌పహాడ్ జడ్పీ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు రామన్న పాల్గొన్నారు.

భీమిని, (ఆంధ్రజ్యోతి): భీమిని, వీగాం పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి రంగవల్లులు వేశారు. భోగి మంటలు వేసి గాలి పటాలు ఎగురవేశారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు విజయ, సంధ్యారాణి, స్వాతి, రాజు, పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ధర్మారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో హరిదాసుల కీర్తనలు, ముగ్గుల పోటీలు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

కబ్జాకు గురైన పాఠశాల భూమి స్వాధీనం

వేమనపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భూమి కబ్జాకు గురి కాగా శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకుని పాఠశాలకు అప్పగించారు. దస్నాపూర్ శివారులోని సర్వే నెంబరు 80లో 2 ఎకరాల భూమి కబ్జాకు గురి కావడంతో మాజీ సర్పంచు రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. కబ్జాకు గురైన రెండు ఎకరాల భూమిని పాఠశాలకు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ గ్రామస్థుల సహకారంతో రెండు ఎకరాల భూమి చుట్టూ హద్దులు ఏర్పాటు చేశారు.

విద్యార్థిని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జైపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన జైపూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సాయిని శుక్రవారం పాఠశాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రాము మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి రామగిరి మధు, నాయకులు జలంపల్లి ప్రశాంత్, రామగిరి రాకేష్, ఇరిగిరాల రవితేజ, అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు 6 నెలల జైలు శిక్ష

● రూ.1500 జరిమానా

వాంకిడి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి నిర్లక్ష్యంగా ఆటో డ్రైవింగ్ చేసి ఆరుగురు చిన్నారుల మరణానికి కారణమైన కేసులో డ్రైవర్ రామ్‌చందర్‌కు ఆసిఫాబాద్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి ఆరునెలల జైలుశిక్ష రూ.1500 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలానికి చెందిన ఆటోడ్రైవర్ మోహర్లే రామ్‌చందర్ 10-08-2017న తన ఆటోలో కెరమెరి మండలానికి చెందిన పదిమంది పిల్లలను ఎక్కించుకుని వాంకిడి మండలంలోని సరండి గ్రామంలో జరిగే భవానిజాతరకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో బెండార గ్రామ సమీపంలోని వంతెన మూలమలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ఆటోలోఉన్న ముగ్గురు పిల్లలు అక్కడికక్కడే మృతిచెందగా గాయపడ్డ మిగతావారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరో ముగ్గురు మృతిచెందారు. మద్యంతాగి నిరక్ష్యంగా డ్రైవ్ చేసిన రామ్‌చందర్‌పై వాంకిడి పోలీసులు కేసునమోదు చేయగా అప్పటి ఎస్సైరాజు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు.

ఏపీపీ ఎలిశా సాక్షులను కోర్టులో హాజరు పరచగా నేరం రుజువుకావడంతో న్యాయాధికారి అనంతలక్ష్మి నిందితుడికి 6నెలల జైలు, రూ.1500జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ఎస్సై ప్రశాంత్, కోర్టు సిబ్బంది ఫూల్ సింగ్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాస్ అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

వాంకిడి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండువాహనాలను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ముందస్తు సమాచారం మేరకు పశువులతో వెళ్తున్న రెండు పికప్ వాహనాలను ఎస్సై ప్రశాంత్, ఏఎస్సై పోశెట్టి సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా రెండు వాహనాల్లో హైదరాబాద్‌లో విక్రయించేందుకు 25పశువులను తరలిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన వ్యాపారివికాస్, మొంటు, సలీం ఖురేషి, షేక్‌అస్లం, సులేమాన్, ఆసీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న 8ఆవులు, 17 ఎద్దులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ఎం సురేంద్రకుమార్

రెబ్బెన, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ఎం సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం రెబ్బెన మండలం గోలేటిలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక, ఇతర కార్మికసంక్షేమ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచితకుట్టు శిక్షణ మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్మిక సంక్షేమ మండలి అధికారి కేవీఎస్ రామ్మోహన్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్, ట్రైనింగ్ టీచర్ ముక్తేశ్వరి, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న పీజీసీఆర్టీ ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు పీజీలో భౌతిక శాస్త్రం చదివి ఉండి, బీఈడీ అర్హత ఉండాలని సూచించారు. ఈనెల11 సాయంత్రం 4.30గంటలలోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పిడీసీఎల్ ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

తిర్యాణి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సూర్యప్రకాష్ రావు శుక్రవారం టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘంనాయకులు భరత్, ప్రవీణ్‌కు మార్, దేవుషా, నగేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ ఏటీఏ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నాయకులు ఆత్రం చొక్కారావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి మనోహర్, మండల అధ్యక్షుడు జంగు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక

కాసిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ ఈవెంట్‌కు కాసిపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కలీం తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని బర్హాన్‌పూర్‌లోని మాక్రోమిషనరీ అకాడమీలో ఈ నెల 11,12 తేదీల్లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారని, ప్రవీణ్ ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయనను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిన్నింగు మిల్లును పరిశీలించిన అధికారులు

తాండూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహేశ్వరి జిన్నింగు మిల్లును శుక్రవారం రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా పత్తి కొనుగోలు చేపట్టాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ ఎజాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక

కాసిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సాయిశోభిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యూనికేషన్ అంశంపై ప్రదర్శన చేసి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 20న పుదుచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, ఓరియంట్ కంపెనీ అధికారులు అభినందించారు.

ఘనంగా యువజన దినోత్సవం

చెన్నూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి ప్రిన్సిపాల్ పట్వర్ధన్ పూలమాలలు వేశారు. వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

అలమా అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ఆరాధ్య

సిర్పూర్(టి), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్ఆర్ స్కూల్‌లో 5వతరగతి చదువుతున్న ఇందారపు సుధ-ప్రశాంత్‌లకూతురు ఆరాధ్య ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ స్థాయి అలమా అబకస్ పోటీల్లో ట్రిపుల్ ఏ కేటగిరిలో 2వస్థానం సాధించింది. ఆరాధ్య ప్రదర్శనపై తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

నష్ట పరిహారం పంపిణీ

సిర్పూర్(టి), జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన గంగుల శంకర్ ఆవు.. పులి దాడిలో మృతి చెందగా శుక్రవారం ఫారెస్టు డివిజనల్ అధికారి సుశాంత్ సుఖదేవ్ రూ.8వేల నష్ట పరిహారం కిందచెక్కును అందజేశారు. కార్యక్రమంలో అటవీ అధికారులు పాల్గొన్నారు.

దీక్ష భూమి జాతర పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11నుంచి 17వరకు నార్నూరు మండలం కొత్తపల్లిలో శ్రీసేవాలాల్ మహారాజ్ దీక్షభూమిలో జరిగే46వ గురుకృప జాతరకి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కమిటీసభ్యులు ఆవిష్కరించారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ మండల కార్యవర్గం


కౌటాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బుద్ధవిహార్‌లో శుక్రవారం ఫొటో, వీడియోగ్రాఫర్స్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నగేష్, ఉపాధ్యక్షుడిగా రాజు, కార్యదర్శులుగా రాజు, జితేందర్, సభ్యులుగా శ్రీనివాస్, నాందేవ్, జీవన్, శంకర్, నారాయణను ఎన్నుకున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి రిమాండ్

కౌటాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): యాపల్‌గూడ గ్రామానికి చెందిన చాపిడి రాజేశ్వర్, తులసీం, నాగపల్లి గ్రామానికి చెందిన కార్తీక్, అజయ్ బుధవారం ఘర్షనపడ్డారు. సమాచారం అందుకున్న కానిస్టేబుళ్లు సాయిరాజ్‌గౌడ్, అజయ్‌లు అక్కడికివెళ్లగా రాజేశ్వర్, తులసీరాం వారిని తోసివేశారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శుక్రవారం తెలిపారు.

ముక్కోటి ఏకాదశికి పోటెత్తిన భక్తులు

● కిటకిటలాడిన ఆలయాలు
● స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్, సీపీ దంపతులు


గూడెం సత్యదేవుడిని ఉత్తర ద్వారం ద్వారా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

● గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో..

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి):ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని గూడెం సత్యనారాయణ స్వామి, అయ్యప్పస్వామి ఆలయాలతోపాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్తరద్వారం ద్వారా స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. వందలాది మంది భక్తులు ఆలయాలను సందర్శించి అభిషేకపూజలు నిర్వహించారు.

మందమర్రి టౌన్, జవవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేంకటేశ్వర ఆలయంలో ఉదయం 5 గంటల నుంచే స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదా లను ఆలయ ప్రధాన అర్చకులు అనంతచార్యులు అందజేశారు. ముక్కోటి ఏకాదశి ప్రాముఖ్యతను పండితులు వివరించారు. బారికేడ్‌లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టరు. కలెక్టర్ కుమార్‌దీపక్ దంపతులతోపాటు రామగుండం సీపీ శ్రీనివాస్ దంపతులు స్వా మి వారిని దర్శించుకున్నారు.సీపీ ఏర్పాట్ల గురించి సీఐ శశిధ ర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్సై రాజశేఖర్, పాల్గొన్నారు. అనంతరం సీపీ పంచముఖ స్వామి ఆలయాన్ని దర్శించారు. జీఎం దేవేందర్ దంపతులు పూజలు నిర్వహించారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా గోదావరి కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టూ ప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సతీమణి రాజకుమారితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పెద్ద సంఖ్యలో వైకుంఠ ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయఈవో ముక్త రవి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


మందమర్రి పూజల్లో కలెక్టర్ కుమార్‌దీపక్ దంపతులు

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): గుడిపేట బెటాలియన్ ఎదురుగా ఉన్న గోవింద క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసున్ని భక్తులు దర్శించుకున్నారు. పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, ఉప ఆలయాల నిర్మాణ దాతలు బిల్ల మల్లయ్య దంపతులు, దుమ్మని వెంకటేష్, గోనె సతీష్‌రావు, బోసుబాబులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట, (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి వేడుకలను పట్టణంలో అన్ని ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఇటిక్యాల లక్ష్మీనరసింహుని ఆలయంలో వేద పండితులు గొల్లపల్లి రామనందస్వామి, శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకంతోపాటు సుదర్శన నరసింహ హోమం, ఉత్తరద్వార దర్శనం నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంతోపాటు సాంబశివాలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. ఆలయాలకు వేకువ జామునే భక్తులు పోటెత్తడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న మంచిర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప్పలయ్య

● ఘనంగా ఉత్తరద్వారం ప్రారంభం

మంచిర్యాల క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల రామలింగేశ్వర ఆలయానికి శాశ్వత ఉత్తరద్వారాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ తూముల వెంకటేష్, సమన్వయకర్త నరేష్, కాంగ్రెస్ నాయకులు జగన్మోహన్‌రావు, కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్, కౌన్సిలర్ భానేష్, తూముల వెంకటరామయ్య, పూరేళ్ల రాజన్న పాల్గొన్నారు. అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఎర్రం తిరుపతి, ఒడ్నాల రవిందర్, గురువయ్యలు పాల్గొన్నారు.


విశ్వనాథ ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు


శ్రీలక్ష్మీనరసింహుడికి పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు


నస్పూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవి చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవి చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవి చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయుడు

తాండూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :మాదారంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఫిజిక్స్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఐలాపురం విద్యాసాగర్ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 28 వరకు ఢిల్లీలోని సీసీఈఆర్‌టీలో జరుగుతున్న జాతీయ విద్యా విధానం శిక్షణలో పాల్గొననున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలల పనితీరు అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యాసాగర్‌ను ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

మందమర్రిరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని డీఈవో యాదయ్య సూచించారు. శుక్రవారం ఆదిల్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలకు బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ టీవీ, ప్రింటర్, సౌండ్ సిస్టంను విరాళంగా అందజేయగా డీఈవో వాటిని ప్రారంభించి మాట్లాడారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఎంఈవో శ్రీనివాస్, నెన్నెల ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చౌదరి, పొన్నారం హెడ్‌మాస్టర్ దత్తమూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, సిబ్బంది సునీత, దేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

చెన్నూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య కోరారు. శుక్రవారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం కోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించకపోవడం శోచనీయమన్నారు. వర్గీకరణ చేయకపోతే మాదిగల చావు డప్పులు మోగుతాయన్నారు. వర్గీకరణను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అడ్డుకుంటున్నారన్నారు. రేగుంట చంద్రశేఖర్, బాపు, తిరుపతి, సారయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శబరికి బయలుదేరిన గురుస్వాములు

కాగజ్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్ట ణంలో అయ్యప్పదీక్ష తీసుకున్న గురుస్వాములు శుక్రవారం శబరికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్థానికస్వాములు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్ష స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెంచికలపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామానికిచెందిన చెన్నబోయిన మహేష్‌కు సీఎం ఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కును శుక్రవారం బీజేపీ నాయకులు మధుకర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, భీమయ్య, శోభన్, శ్రీకాంత్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళను చేరదీసిన కుమార్

గర్మిళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని 11వ వార్డులో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళను కాలేజీ రోడ్డులోని యువశక్తి అనాథాశ్రమం నిర్వాహకుడు కల్వరి కుమార్ చేరదీశారు. మహిళను స్థానికులు గుర్తించి కౌన్సిలర్ శ్రీలతసదానందం దృష్టికి తీసుకువెళ్లగా కౌన్సిలర్ సీఐ ప్రమోద్ రావుకు సమాచారం అందించారు. సీఐ కల్వరి కుమార్‌కు తెలుపగా ఆయన ఆశ్రమానికి తీసుకువెళ్లారు. డిప్యూటీ ఎంఆర్‌వో కృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

కోటపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై శుక్రవారం పారుపెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడం, మద్యంసేవించి వాహనాలు నడపరాదని, పరిమితికిమించి ప్రయాణించరాదని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణపత్రాలు ఉండాలని సూచించారు. ఎస్ఐ రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి

భీమారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్వేత అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో సైబర్‌నేరాలపై అవగాహనకల్పించారు. ఎస్ఐమాట్లాడుతూ సంక్రాంతిసెలవుల్లో ఇంటికివెళ్లినప్పుడు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ హోంవర్క్ చేసుకోవాలన్నారు.సైబర్‌మోసాలపట్ల అప్రమత్తం గాఉండాన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే డయల్100కుఫోన్ చేయాలన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

గర్మిళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని రాముని చెరువు ప్రాంతాన్ని శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. చెరువు అన్యాక్రాంతం అవుతుందని స్వచ్ఛంద పౌర సేవాసంస్థ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు పరిశీలించారు. పూర్తినివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. తహసీల్దార్ రూమన్, ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారిశ్యామ్, స్వచ్ఛంద పౌరసభ్యులు మల్లయ్య, తుల మధుసూదన్ రావు, రాజేశం, పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ

బెల్లంపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 11వ తెలంగాణ స్టేట్‌లెవల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలను సాధించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్యను శుక్రవారం రామగుండం సీపీశ్రీనివాస్ అభినందించారు. సీపీమాట్లాడుతూ 50సంవత్సరాల వయస్సులో కూడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నాడని, ఆయన అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

జాతీయపోటీల్లో కూడా పతకాలు సాధించి పోలీసుశాఖకు పేరు తీసుకురావాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలుదామోదర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

దండేపల్లి,జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్‌కార్యవర్గాన్ని శుక్రవారం నెల్కివెంకటా పూర్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చుంచు చందు, ప్రధానకార్యదర్శిగా కొప్పుల లక్ష్మణ్, గౌరవఅధ్యక్షుడిగా అప్పని సత్తయ్య, ఉపాధ్యక్షులుగా బివిరాజు, క్యాషియర్‌గా సలేంద్ర రాముచారి, జాయింట్ సెక్రె టరీగా అడ్లూరి కుమార్, ముఖ్య సలహాదారులుగా సందనేని నర్సయ్య, సంద మనోహర్‌తోపాటు కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రేపు స్వామి వివేకానంద జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న నస్పూర్‌లోని సమీకృత జిల్లాభవనంలో స్వామి వేకానంద జయంతివేడుకలను నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడఅధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, క్రీడాకారులు పాల్గొనాలన్నారు.



అటవీ అనుమతులతో ఉత్పత్తి మరింత పెంపు

శ్రీరాంపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అటవీ అనుమతులతో ఏరియాలో బొగ్గుఉత్పత్తి మరింత పెరుగుతుందని శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. ఫారెస్ట్‌డివిజనల్ అధికారి సర్వేశ్వర్ రావుతో జీఎం శుక్రవారం జీఎం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏరియాలోని శ్రీరాంపూర్ ఉపరితల గని విస్తరణలో భాగంగా 164 హెక్టార్ల అటవీ భూమికి అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. దీంతో ఉత్పత్తిని మరింత పెంచుతామని తెలిపారు.

వైరస్ బారిన పడకుండా జాగ్రత్త పడాలి

శ్రీరాంపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నూతనంగా వస్తున్న హెచ్ఎంపీవీ వైరస్ బారిన పడకుండా కార్మికులు జాగ్రత్తలు పాటించాలని ఏరియా వైద్యాధికారి డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆర్కే7 గనిపై శుక్రవారం నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులు, వృద్ధులను ఈ వైరస్ త్వరగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్లు దుస్తులపై పడకుండా జాగ్రత్త పడాలన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీవేతనాలు ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, బ్రాంచ్‌అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని సివిల్ విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకుచెందాల్సిన హక్కులు అందించాలన్నారు

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాసిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాసిపేట 2వ గనిలో గైర్హాజరు కార్మికులకు శుక్రవారం గనిమేనేజర్ లక్ష్మీనారాయణ కౌన్సెలింగ్ నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి చెందాలంటే కార్మికులు గైర్హాజరు కాకుండా బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలన్నారు.

ఎస్టీపీపీకీ బెస్ట్ వాటర్ ఎఫీషియెంట్ అవార్డు

జైపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జైపూర్ లోని సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి బెస్ట్ వాటర్ ఎఫీషియెంట్ అవార్డు లభించినట్లు ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 3వ జాతీయ వపర్ జనరేషన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఎస్టీపీపీకి అవార్డు వచ్చిందని తెలిపారు. సింగరేణి థర్మల్ విద్యుత్ అత్యల్పంగా నీటిని వినియోగించినందుకు ఈ అవార్డు లభించిందన్నారు. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ వారి ఆధ్వర్యంలో ఈ అవార్డును సింగరేణి విద్యుత్‌కేంద్రం అధికారి (ఈఅండ్ ఎం) పంతుల అందుకున్నారని తెలిపారు. జాతీయస్థాయిలో 500ఎండబ్ల్యూ ఆ పైన సామర్థ్యం గల సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ కేంద్రాల్లో ఈ అవార్డుకు పోటీపడగా సింగరేణి థర్మల్‌విద్యుత్ కేంద్రానికి అవార్డు లభించిందన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఒకగంట సమయంలో ఒక మెగావాట్ విద్యుత్‌ఉత్పత్తికి గరిష్ఠంగా 3ఘనపు మీటర్ల నీటిని వినియోగించడానికి ఒకప్రామాణికంగా సెంట్రల్‌ఎలక్ట్రిసిటీ వారు చూపిస్తారన్నారు. సాధారణంగా థర్మల్ విద్యుత్‌కేంద్రాల్లో ఈ ప్రమాణాన్ని దాటే నీటి వినియోగం ఉంటుందన్నారు.సింగరేణి విద్యుత్ కేంద్రంలో 2.5ఘనపు మీటర్లనీటి వినియోగం తోనే ఒక గంట సమయంలో ఒక మెగావాట్ ఉత్పత్తి చేస్తుందన్నారు. అవార్డు రావడంతో సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణరావు ఉద్యోగులను అభినందించినట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ అధికారి పంతుల

స్ట్రక్చరల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడం మంచిదికాదు

మందమర్రి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో స్ట్రక్చరల్ సమావేశాలు ఇప్పటివరకు చేయకపోవడం మంచిదికాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఏరియాలోని శాంతిఖని గనిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో సొంతింటికల కోసం కార్మికుల సంతకాలు చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో నాగరాజు,సంజీవ్, సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం

కాసిపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయూసీ బెల్లంపల్లిబ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. శుక్రవారం కాసిపేట గనిపై ఆయన మాట్లాడుతూ గుర్తింపుసంఘం ఎన్నికల్లో నాలుగుసార్లు ఏఐటీయూసీని కార్మికులు గెలిపించారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం క్యాలెండర్లను విడుదల చేశారు.

సమస్యలు పరిష్కరించేందుకే జనరల్‌బాడీ సమావేశం

మందమర్రిటౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించి పరిష్కరిం చేందుకే ఈనెల12న మందమర్రిలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తు న్నట్లు కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్య క్షుడు దేవిభూమయ్య పేర్కొన్నారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలోనే సింగరేణిలో అనేకహక్కులు సాధించామన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీరాంపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ శుక్రవారం జీఎం కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, అధికారులసంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సింగరేణి నూతన క్యాలెండర్‌ను జీఎం శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శేష శయన రావు, ఎస్‌వోటు జీఎం కె రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.



గిన్నెధరిలో 6.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీ మండలాలు చలికి వణికి పోతున్నాయి. శుక్రవారం జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెధరిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.8డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సిర్పూర్(యు)లో 6.9 డిగ్రీలు, కెర మెరిలో 8డిగ్రీలు, తిర్యాణిలో 8.1డిగ్రీలు, కెరమెరి మండలం ధనోరలో 8.8డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలినుంచి ఉపశమనం పొందేందుకు ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలిమంటలు కాగుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్‌లో సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్, నెలవారి మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణంలోని అన్నిప్రాంతాల్లో (గుండిరోడ్, ఫారెస్టు చెక్‌పోస్టు, న్యూ అండ్ ఓల్డ్ రాజంపేట మినహా) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈ లక్ష్మిరాజం తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో జిల్లాలోని అన్ని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11నుంచి 15వరకు కొనుగోళ్లు నిలిపివేస్తామని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఆదేశాల మేరకు విద్యార్థులకు శుక్రవారం అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, కీం, బబ్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో ట్రాఫికర్



కాగజ్‌నగర్ మార్కెట్‌లో ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

- మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- రోడ్లపైనే అమ్మకాలు
- పండుగ పూట మరీ రద్దీ

కాగజ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధాన మార్కెట్‌లో వీధివ్యాపారులు, పండ్లవ్యాపారం చేసే వారు రోడ్లపైనే అమ్మకాలు చేయటం, దుకాణాల వద్ద వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో కాగజ్‌నగర్ మార్కెట్‌లో నడవటం కూడా కష్టతరంగా మారుతోంది. పండుగల సమయంలో మరింత ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు ఈ విషయంలో చర్యలు చేపట్టక పోవటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కాగజ్‌నగర్‌కు చెందిన 30వార్డుల ప్రజలు వివిధ అవసరాల కోసం మెయిన్ మార్కెట్‌కు వస్తుంటారు. మెయిన్ మార్కెట్ రద్దీగా ఉంటోంది.

రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ రద్దీగా ఉంటుంది. ఇందిరా మార్కెట్‌లో నిత్యం భారీ వాహనాల్లో వచ్చిన వివిధ కూరగాయాలను అన్‌లోడ్ చేస్తుంటారు. దీంతో ఈ మార్కెట్‌లో కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా మారుతోంది. పట్టణ ప్రధానరోడ్లు వెడల్పు కాలేదు. గతంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసే సమయంలో రోడ్ల వెడల్పు కార్యక్రమం శ్రీకారం చుట్టినప్పటికీ రాజకీయ ఒత్తిడిల వల్ల ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం రైల్వేఓవర్ బ్రిడ్జి కింది భాగానికి ఆటోలు వెళ్లాలంటే కూడా కష్టంగా ఉంది. ఈ మార్గంలోనే పేరొందిన ఆసుపత్రులున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు దారి మళ్లించి వేరేమార్గాన ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిత్యం ఎస్పీఎంకు సంబంధించిన లోడ్ లారీలు వస్తుం టాయి. వీటితోపాటు ఉదయం పూట వివిధ పాఠశాలలకు చెందిన బస్సులు, ఆటోల్లో పిల్లలను తీసుకెళుతుంటారు. ఫాతీమా కాన్వెంటు పాఠశాల సమీపంలో ఉదయం, సాయంత్రం పది నిమిషాలపాటు ట్రాఫిక్ నిలిచి పోతోంది. ఈ సమస్య ప్రతినిత్యం ఉంటుండగా పండుగ సమయాల్లో చెప్పనలవి కాదు. ఆయా సందర్భాల్లో అధికారులు కనీసం ఇటు వైపు చూడకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం లోడ్ లారీలు, ఇతర వాహనాలు పాఠశాలల సమయంలో ఫాతిమాకాన్వెంటు రోడ్డు, తదితర పాఠశాల ఎదుట గల రోడ్డుపైనే నిలిపేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కేవలం ఆటోలు, ద్విచక్రవాహనాలను అనుమతిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని పేర్కొంటున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే ట్రాఫిక్ సమస్య క్లియర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు చేపడితే సమస్యలు తీరుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. మాస్టార్‌ప్లాన్ లో వార్డుల్లో కూడా గల్లీల వెడల్పు చేయాలనే నిర్ణ యం ఉంది. దీంతో గల్లీల్లో కూడా వాహనాలు వెళ్లేందుకు వీలు ఉంటుంది. అధికారులు వెంటనే స్పందించి మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే బాగుటుందని ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు.

పండుగ పూట ఇబ్బందులు..

సిద్దం శ్రీనివాస్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో మెయిన్ మార్కెట్‌లో పండుగ పూట వివిధ వస్తువులు కొనుగోలు చేద్దామను కునే ప్రజల కష్టాలు అంతా ఇంతా కాదు. ట్రాఫిక్ నిలిచి పోతుండడంతో కనీసం కాలినడకన కూడా వెళ్ల లేని పరిస్థితి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపితే బాగుంటుంది. సంక్రాంతి పండుగకు పట్టణాల నుంచి ప్రజలు వస్తుంటారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తే బాగుంటుంది.



ఇరుకుగా ఉన్న వీధులు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం..

రాజేంద్ర ప్రసాద్, సీఐ, కాగజ్‌నగర్



ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డుపై వాహనాలు నిలుపరాదని సంబంధిత దుకాణాల యాజమానులకు ముందస్తుగానే హెచ్చరిస్తున్నాం. వాహనదారులు రోడ్డుపై నిలిపితే ఫైన్‌వేస్తున్నాం. ప్రధానరోడ్లపై ట్రాఫిక్‌లేకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కేసీఆర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లో శుక్రవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులు, రెండు నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం శ్రీశైలం దేవస్థాన ప్రసాదాన్ని అయనకు అందజేశారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని, ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనాన్ని నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటి ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. అంతకుముందు అంబేద్కర్‌చౌక్‌నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటికివెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు రాజేందర్, ఆశా వర్కర్లు స్వరూప, నవీనా, దేవి, పూజ, భారతి, వనిత, లక్ష్మి, సునీత పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన జిల్లా విద్యార్థి ప్రాజెక్టు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆసిఫాబాద్ మోడల్ హైస్కూల్‌కు చెందిన 8వతరగతి విద్యార్థి సుమిత్ సోలంకి రూపొందించిన ఎలక్ట్రానిక్ హమ్మర్ పరికరం జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల7నుంచి 9వరకు జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో జిల్లానుంచి 30ప్రాజెక్టులు పాల్గొన్నాయి. దీంట్లో సుమిత్ సోలంకి రూపొందించిన "ఎలక్ట్రానిక్ హమ్మర్" పరికరం జాతీయస్థాయికి ఎంపి కైంది. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి, రాష్ట్రీయ విద్యాపరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ చేతుల మీదుగా విద్యార్థి సుమిత్ సోలంకి బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక కావడంపై జిల్లాసైన్స్ అధికారి మధుకర్, పాఠశాల కరస్పాండెంట్ ఆర్ సునీత, గైడ్‌టీచర్ నరేందర్ విద్యార్థిని అభినందించారు.

నేడు హైమన్‌డార్ఫ్ దంపతుల వర్ధంతి



మార్లవాయిలో హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ విగ్రహాలు

జైనూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయిలో శనివారం మానవపరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంప తుల 38వ వర్ధంతిని ఆదివా సులు భాజాభజంత్రీలతో ఆది వాసీ సాంప్రదాయ బద్ధంగా జరుపుకోనున్నారు. ప్రతిఏట మాదిరిగా ఈ ఏడాది సైతం డార్ఫ్ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల నుంచివేలాదిగా తరలివచ్చేలా హైమన్‌డార్ఫ్ యూత్‌సభ్యులు, గ్రామస్థులు కృషి చేస్తున్నారు.

వర్ధంతికి పలువురు రాక..

హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డివి శ్రీనివాస్‌రావు, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు హాజరు కానున్నారని ఆదివాసీ నాయకుడు కనక వెంకటేశ్వర్‌రావ్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా మంత్రి సీతక్కను కూడా ఆహ్వానించామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిర్పూర్(యు), జనవరి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని నేట్నూర్‌లో కబడీ టోర్నమెంట్‌ను రామకృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోడసం ధర్మారావు, మాజీ సర్పంచ్ ఆర్క నాగోరావు,మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కుడ్మెత విశ్వనాథరావు

త్వరలో దిందా వాగుపై వంతెన నిర్మాణం

- ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దిందా-కేతిని గ్రామాల మధ్య ఉన్న వాగుపై త్వరలోనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, విశ్వనాథ్, నానయ్య, అర్షద్ హుస్సేన్, శ్రీవర్ధన్, లింగయ్య, మహేష్, సురేష్, ప్రసాద్, శంకర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలి..

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంపల్లి, లోనవెల్లి, సిర్పూర్(టి) జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యా యులు ఆయన దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. తొలిసారిగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్సీని సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు గణపతి, తులసీరాం, అబ్దుల్ అకీల్, సోహెల్ అహ్మద్, సలీం, మమ్ము, ముత్తగిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల12న మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయ అవరణలో ఈ పోటీలు నిర్వహిస్తామని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటాం

పెంచికలపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వార సంతలో పలుదుకాణాల్లో ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా యజమానులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగంలీగల్ అధికారి శ్రీనివాస్, సోషల్‌వర్కర్ ప్రవీణ్‌కుమార్, పోలీసుసిబ్బంది కొమురయ్య, విజయ్, శంకర్, సాగర్,అరుణ పాల్గొన్నారు.

చైనా మాంజాను అమ్మితే కఠిన చర్యలు

చింతలమానేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చైనా మాంజాను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై నరేష్ అన్నారు. చైనా మాంజాతో మనుషలతోపాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించిందన్నారు. ఎవరైనా అమ్మినా, రవాణా చేసిన సమాచారం ఉంటే డయల్100కు తెలియజేయాలన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

వాంకిడి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉత్తమ బోధనలో హైబిజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సెలెన్సీ పురస్కారానికి వాంకిడి ఉన్నతపాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు నటరాజును పీఆర్టీయూ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వినేష్, గిర్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రెబ్బెన, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రెబ్బెనకు చెందిన కాంగ్రెస్‌పార్టీ యువనాయకుడు హరీష్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు ప్రభుత్వపాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తులసీరాం, మాజీ అధ్యక్షుడు తిరుపతి, సీనియర్ నాయకులు మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని మండలంలోని బూర్గుడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేత లుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: మండలంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ముగ్గులపోటీలు నిర్వహించివిజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి ప్రాథమికపాఠశాలలో శుక్రవారం ముగ్గులపోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఎంఈవో వాసాల ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు కొమ్ము లక్ష్మినారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శాంతి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని కేజీబీవీ, సరండిప్రాథమికపాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో సరండి పాఠశాలలో విజేతలకు హెచ్‌ఎం వినీష్ బహుమతులు ప్రదానం చేశారు.



ఆసిఫాబాద్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

దహెగాం: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిష్‌రావు, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు అందరూ కృషి చేయాలి

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్ర వారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో పదిమండలాల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలినమండలాల అధ్యక్షులను త్వరలోనే ఎంపిక చేస్తామన్నారు. పది మండలాల్లో ప్రకటించిన మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పార్టీ పటిష్టతకు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ మోర్చ ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్, నాయకులు మల్లిఖార్జున్ యాదవ్, శ్రీశైలం, సొల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం కింద దరఖాస్తు అందజేత

చింతలమానేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీలో 31-03-24నుంచి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచిమంజూరైన మొత్తం నిధులు, ఖర్చు పెట్టిన వివరాలు ఇవ్వాలని కోరుతూ కార్యదర్శి కృష్ణకు గ్రామస్థులు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు అందజేశారు.కార్యక్రమంలో గ్రామస్థులు సంతోష్, ప్రకాష్, బాపురావు, వరప్రసాద్, వెంకటేష్, విలాస్ పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి

ఆసిఫాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేకపూజలను నిర్వహించారు. పట్టణంలోని ప్రధానఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో పూజ లను నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మినారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిం చారు. వేద పండితుడు మహేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.



ఆసిఫాబాద్ కేశవనాథ ఆలయంలో, కాగజ్‌నగర్ శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో, బెజ్జూరు రంగనాయక ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

బెజ్జూరు: మండలంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని రంగనాయక ఆలయంలో భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథుడిని వివిధ రకాలపూలతో అందంగా అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.